

# స్వయంకృతం

— జనప్రియ

విజయనగరం జంక్షన్ స్టేషన్‌లో రెండో నెంబర్ ప్లాట్‌ఫారమ్ మీద కొచ్చి ఆగింది బొకారో నుండీ మద్రాసువెళ్లే బొకారో స్టీల్ సిటీ ఎక్స్‌ప్రెస్.

ప్రయాణీకులంతా హడావుడిగా మూటముల్లె పట్టుకుని అటూ, ఇటూ పరిగెడుతూ దిగేవాళ్లని దిగనివ్వకుండా, ఎవరిమటుకు వారు, ఎలాగోలా కంపార్ట్‌మెంట్‌ల్లోకి జొరబడిపోయి సీట్లు సంపాదించేసుకుని కూచోవాలని తెగతాపత్రయ పడిపోతున్నారు.

వారితోపాటూ నేనూ ఒకరిగా, వారిలాగానే, హడావుడిగా నా సూట్‌కేస్, ఎర్‌బేగ్ పట్టుకుని ఓ లేడీస్ కంపార్ట్‌మెంట్‌లోకి జొరబడ్డాను.

అసలే వేసవికాలం... సెలవుల రోజులు... పెళ్లిళ్ల సీజను. సెలవులకి వూళ్లెళ్లేవాళ్లూ... పెళ్లిళ్లకి వెళ్లేవాళ్లూ... పెళ్లిళ్లు చూసుకుని వచ్చేవాళ్లు... తీర్థయాత్రలవాళ్లూ... వినోద, విహారయాత్రలవాళ్లూ... పుట్టుకలకోసం వెళ్లేవాళ్లూ... చావుల కోసం వెళ్లేవాళ్లూ... నిత్య వ్యాపారప్రయాణీకులు కొందరూ... ఆనందంగా వెళ్లేవాళ్లు... విచారంగా వెళ్లేవాళ్లు... నవ్వులు... ఏడుపులు... కేరింతలు... ఇలా రకరకాల మూడ్స్‌లో ఎందరో ప్రయాణీకుల్తో ట్రైన్ మొత్తం కిటకిటలాడిపోతోంది. ఏ బోగీలో ఏ కంపార్ట్‌మెంట్ చూసినా కాలు మోపడానికి కూడా చోటులేనంత రద్దీగావుంది ప్రయాణీకుల్తోనూ, 'లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్స్' అనే రైల్వేవారి నినాదాన్ని వెక్కిరిస్తున్నట్టున్న హెవీలగేజ్‌తోనూ.

ఒక్కో మనిషికి కనీసం నాలుగేసి, అయిదేసి సామాన్లకు తక్కువలేవు. దూరప్రయాణమైనా, దగ్గర ప్రయాణమైనా, ఒక రోజు ప్రయాణమైనా, నాల్గురోజులు ప్రయాణమైనా ఓ సూట్‌కేస్, ఓ ఎర్‌బేగ్, ఓ హోల్డాల్, ఓ టిఫిన్‌బాగ్, ఓ పెద్ద వాటర్‌కేన్ తప్పనిసరిగా వుండాల్సిందే. ఎక్కడా దేనికీ ఇబ్బంది పడకుండా, ప్రయాణాలు చేసేటప్పుడు రైళ్లలో కూడా ఇండ్లలోవుండే సౌకర్యాలన్నీ ఏదీ తక్కువగాకుండా అనుభవించాలన్నదే మనవారి మనస్తత్వం. తాపత్రయం.

మనవారు బాగా సుఖజీవనానికి అలవాటుపడిపోయారు. మనకి మన సుఖం తప్ప ఇతరుల సుఖం మనకి అక్కర్లేదు. 'హే భగవంతుడా! నన్నూ నా వాళ్లనీ, నా ఇంటినీ చల్లగాచూడు. మిగిలిన వూరువూరంతా వల్లకాడైపోయినా మరేంపర్వాలేదు—'' అనుకునే స్వార్థపరులం. అందుకేనేమో మనం ఎదగలేకపోతున్నాం—అనిపిస్తుంది ఒక్కోసారి.

ఎక్కడా నిలబడడానికి కూడా చోటులేని ఆ కంపార్ట్‌మెంట్‌లో నా సూట్‌కేస్‌ని, ఎర్‌బేగ్‌ని ఎలాగోలా సైడ్‌కుండే లగేజ్‌స్టేండ్ మీద పెట్టి ఒంటికాలుమీద నిలు

చున్నాను—ప్రయాణానికి కారణమైన, నన్ను ఇంత ర్యాయ్యా చెయబోయే మద్రాను కంపెనీవాళ్ళని తిట్టుకుంటూ.

అంతలోనే ఓ లావాటి శాల్తీ బోషాణం పెట్టెలాంటి పాతకాలం ట్రంకుపెట్టె ఒకటి భారంగా మోసుకుంటూ కంపార్ట్‌మెంట్‌లో జొరబడింది, అడ్డుగావున్న జనాన్ని తిట్టుకుంటూ, తోసుకుంటూ—

ఆమెని చూస్తే నాకు నవ్వాగింది కాదు. నవ్వేశాను. నాతోపాటు నా ప్రక్కనున్న ఆడాళ్ళు నలుగురూ నవ్వడం ప్రారంభించేరు. ఆమె మా అందరివంకా ఓసారి కన్నెర్ర జేసి చూసింది.

'తాదూర నందు లేదు, మెడకోడేలు' అన్నట్టు తన భారీ శరీరాన్ని తానే మోయలేక నానా అవస్థపడుతున్న ఆ లావాటి శాల్తీ బోషాణం లాంటి ట్రంకుపెట్టెని మోయలేక, మోసుకుంటూ, ఆయాసపడుతూ, ఒగురుస్తూ రావడం చూసి నేను కొంచెం వక్కకి తప్పుకున్నాను.

జనం మధ్యలోంచి ఆమె ఆ పెట్టెని మోసుకొస్తూ వుంటే, ఆ పెట్టె తాలూకు ఒకకొన నా నుదుటికి తగిలింది ఎంతవారగా ఒదిగి నిలుచున్నా.

ఒక్కసారి కళ్ళు చీకట్లు కమ్మేశాయి. చేత్తో నుదురు తడిమిచూసుకున్నాను. చేతికి ఎర్రనినెత్తురు అంటుకొని వుంది. నుదురు చీరుకుందన్నమాట. ఆమె మీద విపరీతమైన కోపం ముంచుకొచ్చింది. వాచి లెంపకాయకొట్టాలనిపించింది. నభ్యత అడ్డొచ్చి ఆగాను.

ఆమె మాత్రం ఇదేమీ గమనించకుండా, కనీసం సారీ అన్నా చెప్పకుండా జనాన్ని తోసుకుంటూ లోనికిపోతూనేవుంది.

'ఛీ ఛీ వెధవ మనుమలు' అనుకున్నాను మననులో. మళ్ళీ అంతలోనే, 'పాపం. వాళ్ళేంచేస్తారు. నిజానికి ఆ రైల్వేవాళ్ళకి వుండాలి బుద్ధి. రోజురోజుకీ ప్రయాణీకుల నంఖ్య పెరుగుతున్నప్పుడు, ఎప్పటికప్పుడు రైలుచార్జీలు పెంచేనుకుంటూ పోవడమే తప్ప, వాళ్ళకి మనమేం సౌకర్యాలు చేస్తున్నాం అని ఆలోచించరు. బోలెడంత డబ్బుపోసి టిక్కట్టుకొని ప్రయాణంచేసే ప్రయాణీకులకి కనీసం కూచేడానికన్నా చోటు చూపించాలన్న ఇంగిత జ్ఞానం వుండొద్దూవాళ్ళకి.

ప్రతీ ట్రెయిన్‌కి ఏ పధ్నాలుగో, పదిహేనో బోగీలు తగిలించడం, అందులో వదో వన్నెండో ఫస్టుక్లాసులు, ఏ.సి, చైర్‌కార్లు, టూటైర్లు, త్రీటైర్లు అని రిజర్వ్‌డ్ బోగీలుగా చేస్తారు. మిగిలిన మూడో, నాలుగో సాధారణ బోగీలుగా వుంచుతారు.

మన దేశంలో ధనికవర్గం శాతంకన్నా బడుగువర్గం శాతం ఎక్కువైనా రైల్వేవాళ్ళ దృష్టిలో మాత్రం బడుగువర్గం శాతం చాలా తక్కువగావున్నట్టు తోస్తుంది కాబోలు మరి!

అంతలోనే గార్డ్ విజిల్ వినిపించింది.

'హమ్మయ్య... మరి పర్వాలేదు. ట్రైన్ బయలుదేరుతుంది. కాస్త గాలాడుతుంది' అనుకున్నాను భారంగా నిట్టూర్చి.

మెల్లిగా ట్రైన్ కదిలింది. అంత ఎండలోనూ, కంపార్ట్‌మెంట్ కిటికీలోంచి దూసుకొచ్చిన నన్ననిగాలితెర మేను తాకగానే ప్రాణం వచ్చినట్లై అంతవరకూ నాలోవున్నా చిరాకు, కోపం ఎగిరిపోయాయి. మనసు కాస్త చల్లబడింది.

ట్రైన్ క్రమంగా స్పీడందుకుంది. ఒకటే కుదుపుతోంది. ఒంటికాలి మీద నిలబడడంవల్ల కాలు నొప్పిచేసి నిలబడలేని పరిస్థితిలోవున్నా. ఎక్కడైనా కాస్తంత చోటు కూచేడానికి దొరుకుతుందేమోనని చూశాను. ఎటువెళ్ళడానికీ వీలులేనంతగా దారంతాసామాన్లతో, జనంతో నిండి వుంది. ఎలాగేలా సామాన్లని దాటుకుంటూ, దారిలో కూచున్నవాళ్ళని తన్నుకుంటూ, వాళ్ళ తిట్లని భరిస్తూ కొంచెం ముందుకెళ్ళిచూస్తే అక్కడ క్రింద బెర్త్‌మీద ఓ ఇద్దరు ఆడవాళ్ళు అంత ఉక్కపోతలోనూ పీకలదాకా దువ్వటి కప్పుకుని పడుక్కొనివున్నారు. సాటి ప్రయాణీకులు నిలుచేడానికి చోటులేక నానాఅవస్థా పడుతూ వుంటే వాళ్ళిద్దరూ అలా పడుక్కోవడంచూస్తే అసహ్యమేసింది.

నిజానికి వాళ్ళు లేచికూచుంటే ఓ అయిదారుగురు సర్దుకుని కూచోవచ్చు. కాని వాళ్ళు అది గ్రహించరు. తమ సుఖమే తప్ప సాటిప్రయాణీకుల గురించి ఆలోచించనివాళ్ళు, నిజంగా నిద్ర పోవడంలేదు. కళ్ళు మూసుకుని నిద్ర నటిస్తున్నారు. లేచికూచుంటే తమ సుఖానికి ఎక్కడ భంగం కలుగుతుందోనని భయం. స్వార్థం. వాళ్ళని చూస్తుంటే ఒళ్ళుమండిపోయింది. అంతకంతకూ నాలో ఓపిక చచ్చిపోసాగింది. నాలాగే ఒంటికాలిమీద జపంచేస్తున్న కొందరాడవాళ్ళు కూడా వారిని ఏమీ అనకపోవడం నాకు ఆశ్చర్యమేసింది.

## చిట్కాలు

వెన్న కాచేటప్పుడు కాస్త ఉప్పు వేస్తే నెయ్యి ఎక్కువకాలం నిలవ ఉంటుంది.

*

బట్టలకు రక్తం, సిరా మరకలు అయితే ఉప్పు కలిపిన నీటితో ఉతికి వేడినీటిలో జాడిస్తే మరకలు సులువుగా పోతాయి.

*

ఉప్పు కలిపిన నీటితో నేల కడిగితే ఈగలు రావు.

*

ఒక లీటరు నీళ్ళలో ఒక ఉల్లిపాయ వేసి సలసల కాచినట్లయితే ఆ నీరు ఎలాంటి మరకలనైనా పోగొట్టి శుభ్రపర్చగలుగుతుంది.

—ఎ. సుబ్బలక్ష్మి

ఇక లాభంలేదని, నేనే ధైర్యంచేసి దొంగనిద్ర నటిస్తున్న ఆ ఇద్దరాడాళ్ళనీ తట్టిలేపడానికి ప్రయత్నించాను. వాళ్ళు గాఢనిద్ర నటిస్తూ అటునుంచీ ఇటుకి, ఇటునుంచీ అటుకి ఒత్తిగిల్లారేతప్ప లేవలేదు. వాళ్ళు మొండికేసేకొద్దీ నాలో పంతంపెరిగి, చేత్తో గట్టిగా తట్టి, కేకలేస్తూ లేపాను.

'ఏంటమ్మా జబరదస్తీ సేత్తున్నావు. మేం టాటానుంచొత్తన్నాం ఇజియవాడదాకెల్లాల. అక్కడ టిటిబాబుకి డబ్బులుకట్టి ఈపాటి సీటు సంపాయించుకుంటే మద్దెలో వొచ్చిందానివి నీకిచ్చీమంటే ఎల్లా ఇచ్చేత్తామనుకుంతన్నావు?'—అని రాగం తీసింది ఒకర్తె.

'ఉస్సో స్సో స్సో... ఎండదెబ్బకి వడగొట్టుకుపోయి కూచోలేక పడుక్కోనుంటే మద్దెలో నీగోలేటి ఎల్లెల్లు.' అని కసిరేసి కాళ్ళు బారజాపుకుని పడుకుంది మరొకర్తె.

చేసేదిలేక వాళ్ళ నోళ్ళల్లో నోరు పెట్టడం శుద్ధవేస్టని నిస్సహాయంగా నిలుచున్నాను.

అంతలోనే 'టికెట్... టికెట్' అన్న 'ట్రావెలింగ్ టిక్కెట్ ఎగ్జామినర్ గొంతు వినబడింది. 'హమ్మయ్య... మరి పర్వాలేదు. అయన గారొస్తే వాళ్ళు లేస్తారు. అప్పుడు ఆయనకీ విషయం చెప్తే వాళ్ళ రోగం కుదుర్తుంది' అనుకున్నాను మననులో.

మరికాసేపటికి రానేవచ్చాడు టీ.టీ. ముందుగా నాకెదురుగా వున్న క్రింది బెర్త్‌మీద నలుగురు పిల్లల్తో ప్రయాణంచేస్తున్న ఓ తల్లిని టిక్కట్ అడిగాడు టీ.టీ.

'పాస్ అండి... మా ఆయనదగ్గర వుంది'—సమాధానమిచ్చింది ఆ తల్లి.

'మరీ మీ ఆయనెక్కడ?'—అడిగాడు టీ.టీ.

'గార్డుగారి పెట్టెలో కూచున్నారండి'

'మీ ఆయనేంచేస్తాడేమిటి?'

'డీజిల్ డ్రైవరండి'

'ఎక్కడ్నుంచొస్తున్నారు?'

'టిట్లాఘర్నుంచండి'

'ఏవూరెళ్ళాలి?'

'తిరుపతండి'

'అలాగా... ఈ పిల్లలు మీ పిల్లలేనా...' అన్నాడు ఆమె పిల్లల్ని చూసి.

'అవునండి'

'అయితే ఓ ఫుల్ టిక్కట్‌కి, నాలుగు అరటిక్కట్లు కలిపి బొకారో నుంచీ గూడూరుకి పెనాల్టీతో సహా డబ్బు కట్టాల' అన్నాడు టీ.టీ. అధికార దర్పంతో.

'ఎందుకండీ... మేమేమన్నా టిక్కట్ లేకుండా వెళ్తున్నామా? మా ఆయన దగ్గర పానుందని చెప్పాకదండీ'—

'అమ్మా... ఇలాంటి మాటలు చెప్పడం మీకు, వినడం మాకు రోజూ అలవాటైపోయింది ఈలైన్లో అదేం కుదరదు. టిక్కటు రాసిస్తాను. డబ్బు కట్టు.'

'మరో అరగంటకి వాల్తేరొచ్చేస్తుంది. అక్కడెలాగూ మా ఆయన వచ్చి పాస్ చూపిస్తారు'.

'మీ ఆయనా, గీయనా, పానూ గీనూ జాన్తానాయ్ టిక్కట్‌లేకుండా బండిలో ప్రయాణం చేయ్యడమే కాకుండా నాదగ్గర అబద్ధాలాడుతున్నావా? ఇదేమన్నా మీ బాబుగాడి బండి అనుకున్నావా? నీయిష్టం వచ్చినట్టు టిక్కట్టులేకుండా ప్రయాణం చేయడానికి...' దబాయించాడు టీ.టీ.

'ఏమండోయ్... మాటలు కాస్త జాగ్రత్తగా రానీయండి. మేమేం టిక్కట్లేకుండా బండెక్కలేదు. మా ఆయన కూడా నీలాగే రైల్వేలోనే పనిచేస్తున్నారు—' అంది కోపంగా.

'ఓ... ఉక్రోషమొచ్చేసిందే—అమ్మగారికి. ఏం నలుగుర్లోనూ తమరి పరువు తక్కువైపోయిందనా? ఏం పర్వాలేదు. దొంగ నాటకాలన్నీ నా దగ్గర కట్టిపెట్టి మర్యాదగా డబ్బుకట్టు'. అని కళ్ళెర్రజేశాడు టీ.టీ.

'పాపం. ఆమెని చూస్తే నాకు జాలేసింది. ఈ మగాళ్ళెప్పుడూ ఇంతే! ప్రయాణాల్లో ఆడవాళ్ళని—పిల్లలనీ ఓచోట వదిలేసి తమ స్నేహితుల్తో బాతాఖానీ వేసుకుంటూ మరో కంపార్ట్‌మెంట్‌లో కూచుంటారు. ఛీఛీ—ఏం మగాళ్ళో... అదేం రోగమో'—అనిపించింది.

నాకు.

ఆవిడకి సాయం చేస్తే బావుండుననిపించింది. నేను కలుగజేసుకుని 'అదేంట్సార్' టి.టిగారూ, ఆవిడ భర్త దగ్గర పానుందని చెప్పారుగా... వాల్తేరులో ఎలాగూ ఆయనొస్తారంటకదా! పాపం.. ఆడవాళ్లని, పిల్లల్తో వున్న వాళ్లని ఇలా ఇబ్బంది పెట్టడం మంచిదా చెప్పండి... వాల్తేరులో ఆయన రాకపోతే అప్పుడు మీ ఇష్టం....' అన్నాన్నేను.

'ఎవరమ్మా నువ్వు... మీ ఆయన కూడా మరో కంపార్ట్‌మెంట్‌లో వున్నాడా!' అన్నాడు వ్యంగ్యంగా.

నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. 'మిస్టర్! మాటలు జాగర్తగారానీండి—' అని గట్టిగా తిరగబడ్డాను.

'లేకపోతే నీకెందుకమ్మా... వాళ్ల సంగతి నీకు తెలీదు. మొదట్లో ఇలానే అంటారు. తర్వాత చూస్తే ఆయనా వుండడు. ఎవడూ వుండడు. దొంగతనంగా మా కళ్లు కప్పి ఇళ్లకు జారుకుంటారు. వీళ్లవల్లే రైల్వేలకి నగానికి పైగా నష్టమొస్తోంది'—అని ఆ తల్లి వంక తిరిగి 'ఊఁ తియ్యిడబ్బు...' అన్నాడు దబాయిస్తూ.

ఆమె ఏమనుకుందో... 'నేను డబ్బుకట్టను మీ ఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండి' అని మొండికేసింది.

'అంతవరకు వచ్చిందా నీ వ్యవహారం... సరే... వాల్తేర్ రానీ చెప్తాను'— అని తన వెంటవచ్చిన టి.టి.పోర్టర్‌ని వాళ్ల దగ్గర కావలావుంచి ఆ బెర్త్‌కి ఎదురుగా వున్న బెర్త్‌మీది ఇద్దరాడవాళ్లని తట్టిలేపాడు.

వాళ్లిద్దరూ తుళ్లిపడిలేచారు.

'టిక్కట్లు తియ్యండి' అన్నాడు.

'నాగరాజు బాబుకిచ్చామండి' అన్నారిద్దరు ఒకేసారి.

'ఆహాఁ... ఏ వూరెళ్లాలి!'

'ఇజియవాడ బాబూ'

'ఎక్కడ్నుంచొస్తున్నారేమిటి!'

'టాటానుండి బాబూ.'

'అలాగా' అని సీట్లకిందా పైనా అంతా పరీక్షగా చూసి ఈ మూటలన్నీ ఎవరివి! మీవేనా'—గద్దించాడు.

'అవును బాబూ'—అన్నారిద్దరూ.

'మరి వీటిక్కూడా డబ్బుకట్టేరా.'

'అన్నిటికి కలిపి యిచ్చేంబాబూ.'

'ఎంతిచ్చేరేమిటీ?'—అనుమానంగా అడిగాడు.

'చెరో యాభై యిచ్చామండి'—

'సర్సర్లే!' అని వాళ్లని వదిలేసి 'టిక్కెట్' అన్నాడు నన్ను చూసి. టిక్కట్ తీసి ఇచ్చాను. దాన్ని 'పంచ్' చేసి తిరిగి ఇస్తూవుంటే 'సార్... ఇంతమంది ఆడవాళ్లు పిల్లాపాపల్తో కూచోడానికి కూడా చోటులేకుండా నానా అవస్థపడుతూ వుంటే ఈ ఇద్దరూ ఒకబెర్త్‌ని పూర్తిగా ఆక్రమించడం ఏమన్నా బావుందా చెప్పండి... ఇదేం రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్‌కాదు కదా! మీరన్నా కొంచెం వాళ్లకి చెప్తే టిక్కట్లు కొనుక్కుని ప్రయాణం చేసే మాలాంటి వాళ్లకి కాస్త సౌకర్యంగావుంటుంది'-అన్నాను.

'అమ్మా! మావని అందరు ప్రయాణీకుల దగ్గర టిక్కట్లు వున్నాయా లేదా అనేది చెక్ చెయ్యడం వరకే! రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్‌లోలాగ మీ అందరికీ సీట్లు చూపించి కూచోబెట్టడం మా బాధ్యత కాదు. మీలో మీరు సర్దుకుపోవాల్సిందే' అన్నాడు టి.టి.

'మరి ఆ యిద్దరికీ టిక్కట్లు లేవు కద్సార్. మరివాళ్ల నెందుకొదిలేసారు? అడిగాను ఒళ్లుమండి.

'మేం అడగ్గానే టిక్కట్ చూపించడం మీ బాధ్యత. అంతేగాని వాళ్ల దగ్గర టిక్కట్ లేదు. వాళ్ల నెందుకొదిలేశారు? అని అడిగే హక్కు మీకు లేదు. మాకేవో 'ఆబ్లిగేషన్స్' వుంటాయి. అవన్నీ 'డిపార్ట్‌మెంట్'కు సంబంధించినవి. అవన్నీ మీకు చెప్పాల్సిన అవసరం మాకు లేదు'—అని మొహం మాడ్చుకుంటూ పక్క కంపార్ట్‌మెంట్‌లో కెళ్లిపోయాడు.

'అందుకే... ఏటేటా రైల్వే బడ్జెట్ లోటు పెరుగుతోంది'—గొణుక్కున్నాను నాలోనేనే.

అంతలోనే వాల్తేరు స్టేషన్ చేరుకుంది రైలు. ఆ నలుగురు బిడ్డల తల్లి కిటికీ దగ్గర నిల్చుని భర్తకోసం ఎదురుచూస్తోంది. బండి ఆగి పదినిముషాలైంది. ఎక్కేవాళ్లు ఎక్కుతున్నారు. దిగేవాళ్లు దిగుతున్నారు. పాపం ఆమెలో భర్తకోసం ఒకటే కంగారు.

అంతలోనే టి.టి.వచ్చి 'ఏమయ్యా ఆవిడగారి భర్తవచ్చాడా?' అని అడిగాడు తను కావలాగా పెట్టి వెళ్లిన టి.టి. పోర్టర్‌ని.

'లేద్సార్... ఇదేదో అనుమానం కేసులా వుంది!' అన్నాడు వాడు బుర్ర గోక్కుంటూ.

'అంతేనంటావా!...' అని ఆ తల్లి వంక తిరిగి 'ఏడమ్మా... నీ మొగుడు... వాల్తేర్‌లో వస్తాడన్నావు... పావుగంటైంది బండి వాల్తేర్‌కొచ్చి... ఊఁ... డబ్బులియ్... టికెట్ రాసేస్తా... నా డ్యూటీ ఇక్కడితో అయిపోతోంది. దిగేముందు తర్వాత టి.టి.కి చార్జి అప్పచెప్పాలి ఊఁ... ఊఁ...' అని తొందర చెయ్యడం ప్రారంభించాడు టి.టి.

'ఉండండిసార్ కాసేపు... మా ఆయనొస్తారు' అంది.

'అయ్యవారు వచ్చేదాకా అమావాస్య ఆగదు. నీతోపాటూ ఇక్కడ కాపరం పెట్టడానికి నాక్కుదర్దు. ఇంత వరకూ చూసింది చాలు గానీ... తియ్ డబ్బు... టైమైపోతుంది'—అని తొందరచేస్తూ ఎక్సెస్ ఫేర్‌టిక్కెట్ బుక్ తీసి ఫర ఫరా గీకేసి, టిక్కట్ చింపి ఆమెకిస్తూ 'తియ్‌డబ్బు'—అని గొడవ ప్రారంభించాడు.

పిల్లల్ని వదిలేసి భర్తని పిలుచుకు రావడానికి వెళ్లాలంటే భయం. పిల్లల్లో ఏ ఒక్కరినైనా పంపుదామంటే ఆ నలుగురూ చిన్న పిల్లలు. ఆ భర్త చూస్తే ఎంతకీరాడు. టి.టి. తొందర అంతకంతకూ ఎక్కువౌతోంది. నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడు, మధ్యమధ్యలో పరుషవాక్యాలు ఉపయోగిస్తూ. సభ్యత గల ఇల్లాలులా వుంది. అతన్ని ఏమీ అనలేక అలానే భర్తకోసం ఎదురుచూస్తూ కూచుని వుంది ఆందోళనగా.

సరిగ్గా బండి బయల్దేరడానికి అయిదు నిముషాలు వుందనగా... అప్పుడొచ్చాడు ఆమె భర్త! 'పద ఫస్ట్ క్లాసులో బెర్త్‌లు దొరికాయి' అంటూ కంగారుగా.

టి.టి. అతన్ని టిక్కట్లడిగాడు. పాస్ చూపించాడు.

ఆమె, భర్త, పిల్లలూ సామాన్లన్నీ తీసుకుని ఫస్ట్ క్లాసు కంపార్ట్‌మెంట్ కెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లిపోయిన తర్వాత ఆ సీటుని నేను ఆక్రమించుకున్నాను విజయగర్వంతో టి.టి.మొహంలోకి చూస్తూ.

టి.టి.మొహంలో నెత్తురు చుక్కలేదు. ఎందుకంటే ఒకసారి రాసిన 'ఎక్సెస్ ఫేర్ టిక్కట్లు' కేన్సిల్ చెయ్యడానికి వీలులేదు. చచ్చినట్లు ఆ టిక్కట్లు డబ్బు మొత్తం తనజేబులోంచి తీసి కట్టాల్సిందే! ఒకటా... రెండా... ఒక ఫుల్ టిక్కట్లు, నాలుగు అరటిక్కట్లు... వెరసి మొత్తం నాలుగు వందల రూపాయలు. ఏం చేస్తాడు... స్వయంకృతం మరి!



## ఐ.ఎమ్.ఎఫ్.ప్రతినిధిగా తెలుగు వనిత కల్పనా కప్పగంతుల

ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ వారి డెలిగేషన్ ప్రతినిధిగా వచ్చిన కల్పనా కప్పగంతుల, మద్రాసు స్టెల్లామేరీస్ కాలేజీ, ఆ తరువాత ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదివి, బ్రవున్ యూనివర్సిటీలో (అమెరికా) పి.హెచ్.డి. చేసి, జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా కొన్ని నెలలు వుండి, ఆ తరువాత ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో ఎకనమిస్టుగా చేరారు.

ఈ సంస్థ శ్రీలంకకు 60 బిలియనుడాలర్ల ఆర్థిక సహాయం చేసే విషయం పరిశీలించేందుకు ఐక్యరాజ్య సమితి తరఫున వచ్చిన అయిదుగురు సభ్యులలో కల్పన అందరికంటే వయసులో చిన్నది—(27 సం॥లు.) ఆంధ్రుల అమ్మాయి కల్పన వేపారామేశం పంతులుగారి మునిమనుమరాలు. హేమా రామేశం దంపతుల కూతురు. కీ.శే. వేపారామేశంగారు మద్రాసు లోని ప్రముఖ ఆంధ్రులు—అప్పట్లో హైకోర్టు న్యాయమూర్తి. మద్రాసు హైకోర్టులో ఆయన ఛాయాచిత్రపటం వుంది. ఈనాడు కల్పన అతిచిన్న వయసులోనే ఒక దేశానికి ఆర్థికసహాయం చెయ్యగల సలహా సభ్యురాలు అయిందీ అంటే ఆమె తల్లితండ్రులేకాదు—ఆడవారంతా గర్వించతగిన విషయం.

—ఎమ్.సి.